# ఇండియన్ ఎకానమీ

## జనాభా – వలసలు

**జనాభా మార్పునకు అత్యంత ముఖ్యమైన కారకాల్లో జననాల రేటు, మరణాల రేటు తర్వాత కీలకమైంది 'వలస'గా చెప్పవచ్చు. ఆక్స్‌ఫర్డ్ నిఘంటువు ప్రకారం ఒక ప్రదేశం/ పట్టణం/ దేశం నుంచి వేరేచోటికి కదిలివెళ్లటమే వలస.**

వలస అనేది మానవులకు సంబంధించిన జీవన సంబంధ అంశమే కాకుండా సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక అంశంగా భావించవచ్చు.

★ వలసకు ఆర్థిక, రాజకీయ కారణాలు అత్యంత ప్రధానమైనవి.

★ డొనాల్డ్ జె. బోగ్ అనే నిపుణుడు వలస అనేది పర్యావరణంలో మానవ వనరుల ఆర్థిక, సాంఘిక జనాభా శక్తుల ప్రతిస్పందనగా పేర్కొన్నాడు.

### వలసలు - ప్రాధాన్యం

★ జనాభా నిర్మితిని, పరిమాణాన్ని వలసలు పెంచటం లేదా తగ్గించటం చేస్తాయి.

★ ఇది జనాభా వృద్ధిరేటును, పరిమాణాన్ని, నిర్మాణాన్ని లక్షణాలను నిర్ణయిస్తుంది.

★ ఏ దేశంలోనైనా జనాభా పంపిణీని నిర్ణయించటంలో వలసలు ముఖ్యపాత్ర వహిస్తాయి.

★ ఏ ప్రాంతంలో అయినా శ్రామిక శక్తి వృద్ధిని వలసలు నిర్ణయిస్తాయి.

★ ఏ దేశంలోనైనా సాంఘిక మార్పుకు ప్రాథమిక సూచనగా చెప్పవచ్చు.

★ ఇది వ్యాపార చక్రాలకు సంబంధించిన, నైపుణ్యం ఉన్న, నైపుణ్యం లేని శ్రామికుల సరఫరాని నిర్ణయిస్తుంది.

★ పరిశ్రమల వృద్ధి, ఉద్యోగితలను నిర్ణయిస్తుంది.

### వలసలు - రకాలు

★ వ్యక్తులు ఒంటరిగా కానీ, కుటుంబంతో కానీ ఒక స్థలం నుంచి మరో స్థలానికి శాశ్వతంగా లేదా తాత్కాలికంగా నివాసం లేదా జీవనోపాధి కోసం మారడమే వలసగా చెప్పవచ్చు.

★ ఒకే పట్టణంలో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి నివాసం మారిస్తే అది వలస కాదు. కిందివాటిని వలసల్లో రకాలుగా పేర్కొనవచ్చు.

★ గ్రామం నుంచి గ్రామానికి.

★ గ్రామం నుంచి పట్టణానికి.

★ పట్టణం నుంచి పట్టణానికి.

★ పట్టణం నుంచి గ్రామానికి.

పై రకాల వలసలను మళ్లీ కింది విధంగా పేర్కొనవచ్చు..

**1) అంతర్గత వలస (Internal immigration) / జాతీయ వలస:** ఒక దేశంలో ఒక స్థలం నుంచి మరో స్థలానికి వలస వెళితే దాన్ని అంతర్గత / జాతీయవలస అంటారు.

**2) ఎమిగ్రేషన్ (Emmigration):** ఒక దేశం నుంచి మరో దేశానికి వలసపోవటం.

**3) ఇమిగ్రేషన్ (Immigration):** మరో దేశం నుంచి ఒక దేశానికి వలస రావటం.

### వలస జనాభా గణనలో వాడే పదాలు

1. స్థూల వలస (Gross Immigration): ఒక ఏడాదిలో నిర్ణీత ప్రాంతానికి వలస వచ్చిన వారిని, అక్కడి నుంచి మరో స్థలానికి వలస వెళ్లిన వారిని కలిపితే మొత్తం స్థూల వలస అవుతుంది.

2. నికర వలస **(Net Immigration):** ఒక ఏడాదిలో ఒక నిర్ణీత స్థలానికి వలస వచ్చిన వారి నుంచి మరో స్థలానికి వలసపోయిన వారిని తీసివేస్తే మిగిలిన మొత్తం నికర వలస అవుతుంది.

**అంతర్గత వలస**

★ ఒక దేశంలో / దేశ సరిహద్దులో ఆ దేశ ప్రజల కదలికను అంతర్గత వలస అంటారు. ఇది కొన్ని కిలో మీటర్ల నుంచి వేల కిలో 0మీటర్ల వరకు ఉంటుంది.

**అంతర్గత వలస గణన – మూలాలు**

**1.** జనాభా గణాంకాలు

**2.** నమూనా సర్వేలు

**3.** జనాభా రిజిష్టర్లు

**అంతర్గత గణన - లెక్కించే పద్ధతులు**

★ ఇవి 2 రకాలు 1) ప్రత్యక్ష 2) పరోక్ష పద్ధతులు

**అంతర్గత వలస గణన – ప్రత్యక్ష పద్ధతులు**

దీనిలో 1) జన్మస్థలం 2) నివాస సమయం 3) చివరి నివాస స్థలం 4) నిర్ణయించిన తేదీ ముందు నివాస స్థలం

**నికర అంతర్గత వలస గణన – పరోక్ష పద్ధతులు**

పరోక్ష పద్ధతులు అన్నీ కూడా నికర అంతర్గత వలసలను లెక్కిస్తాయి. వీటిలో ముఖ్యమైనవి

1) వివిధ సాంఖ్యక / గణన పద్ధతి (Vital statistics method)

2) సర్వైవల్ రేషియో మెథడ్

3) వలస రేటు పద్ధతి

**ఎ) వైటల్ స్టాటిస్టిక్స్ పద్ధతి:** ఇది జననాలు, మరణాల ఆధారంగా జనాభా గణాంకాలను తెలుపుతుంది.

★ 2 గణన సంవత్సరాల మధ్య సహజ పెరుగుదల అంచనాలు తెలుపుతుంది.

$$\text{Net } M = (P_1 - P_0) - (B - D)$$

Net M = నికర వలస

B – సెన్సస్ మధ్యలో జననాల రేటు

$P_0$ – గత సెన్సస్ జనాభా

D – సెన్సస్ మధ్యలో మరణాల రేటు

$P_1$ – ప్రస్తుత సెన్సస్ జనాభా

**బి) సర్వైవల్ రేషియో పద్ధతి (ఆయుఃప్రమాణ నిష్పత్తి పద్ధతి):** దీన్ని ఆయుఃప్రమాణ సంభావ్యత అంచనాలను బట్టి లెక్కిస్తారు. దీనికి స్త్రీ, పురుషుల వయసును 2 వరుస సెన్సస్‌ల మధ్య లెక్కిస్తారు.

★ జనగణన సమయంలో పుట్టిన వారి నికర వలస వాటాను ఇది లెక్కించదు.

**సి) వలసల రేటు పద్ధతి:** నిర్దిష్టంగా పేర్కొన్న సమయం మధ్యలో ఉన్న జనాభాలో వలసల సంఖ్యను తెలుపుతుంది.

$$m = \frac{M}{P} \times K$$

m = వలసల రేటు (నిర్దేశించిన వలస సమయం)

M = వలసల సంఖ్య (జనాభా గణన మధ్య సమయం)

P = Population exposed to the likelihood of migration

K = 100 / 1000

**వలసలు - సిద్ధాంతాలు**

వలసలకు కారణాలు అన్వేషించిన వారిలో అనేక మంది ముఖ్యులున్నారు....

★ 1885, 1889 సంవత్సరాలలో లావెన్‌స్టీన్ ప్రచురించిన వ్యాసాలు వలస సిద్ధాంతాలకు పునాది వేశాయి.

★ తర్వాత లెనిన్, ఫీ, రెవిస్, ఎవరెట్ లి, దామల్సన్, టోడరో మొదలైనవారు వలస సిద్ధాంతాలు ప్రతిపాదించారు.

★ భారతదేశంలో వలస ప్రక్రియను డొనాల్డ్ బోగ్ విశేషంగా అధ్యయనం చేశారు.

**డొనాల్డ్ బోగ్ – వలస సిద్ధాంతం:** డొనాల్డ్ బోగ్ గ్రామీణ - నగర వలసను పుష్ (push) పుల్ (pull) కారకాల ఆధారంగా విశ్లేషించాడు.

★ బోగ్ అభిప్రాయంలో గ్రామాల్లో పుష్ కారకాలు, నగరాల్లో పుల్ కారకాలు ఉంటాయి.

1) పట్టణాలకు ప్రజలను ఆకర్షించే (లాక్కునే అంశాలు) కారకాలు - పుల్ (pull) కారకాలు.

2) గ్రామాల నుంచి పట్టణాలకు వలసను ప్రోత్సహించే / (నెట్టివేసే) కారకాలు - పుష్ (push) కారకాలు.

**పుష్ కారకాలు**

గ్రామాల్లో కింది అంశాలు పట్టణానికి వలస వెళ్లేవిధంగా పుష్ కారకాలుగా పనిచేస్తాయని బోగ్ పేర్కొన్నాడు.

★ ప్రకృతి విపత్తులు - వరదలు, కరవులు, భూకంపాలు, సునామీ.

★ కుటీర పరిశ్రమలు, చేనేత పరిశ్రమలు మూతపడటం.

★ అధిక జనాభా.

★ వ్యవసాయ యాంత్రికీకరణ, వ్యవసాయ కార్మికుల నిరుద్యోగిత.

★ వృత్తిశిక్షణ, ఉన్నత విద్య అవకాశాలు లేకపోవటం.

★ సరైన వైద్య, ఆరోగ్య సదుపాయాలు లేకపోవటం.

★ అగ్రకులాల ఆధిపత్యం, ఆర్థిక, సాంఘిక అసమానతలు.

★ కులం, మతం, రాజకీయ, ప్రాంతీయ ఘర్షణలు

**పుల్ కారకాలు**

నగరాల్లో ఉండే కింది పరిస్థితులు గ్రామాల నుంచి వలసలను (ఆకర్షించడం) ప్రోత్సహిస్తాయని బోగ్ పేర్కొన్నాడు.

★ వర్తక, వాణిజ్యాలు, పారిశ్రామిక, సేవా రంగాల్లో ఉపాధి అవకాశాలు పెరగటం.

★ సామాజిక, ఆర్థిక గమన శీలతకు ఎక్కువ అవకాశాలు ఉండటం. ఉన్నత విద్య, వృత్తి శిక్షణకు అవకాశాల లభ్యత ఎక్కువగా ఉండటం.

★ వైద్య, ఆరోగ్య వసతులు ఎక్కువగా ఉండటం.

★ క్రీడలు, వినోదం, విరామాలకు అవకాశాలు అందుబాటులో ఉండటం.

★ నగరాల్లో భూమి, గృహాలు లాంటి రియల్ ఎస్టేట్ రంగాలలో పెట్టుబడులు లాభసాటిగా ఉండటం.

★ నగరాల్లో జీవన విధానం అత్యంత ఆకర్షణీయ విధానాలతో కూడి ఉండటం.

★ నగరాల్లో సాంస్కృతిక వైవిధ్యం ఉండటం.

★ కులమత సహనం, వివిధ భాషలు, కులాలు, మతాల మధ్య విలీనానికి అవకాశాలు ఎక్కువగా ఉండటం.

## భారతదేశంలో వలసలు

దేశంలో వలసల సమాచారాన్ని 1951లో NSSO సేకరించింది. ఇది మొదటి విడత సమాచారం.

★ స్వాతంత్ర్యం తర్వాత పెద్ద నగరాల్లో జనాభా విస్ఫోటనకు ప్రధాన కారణం వలసలుగా చెప్పవచ్చు. కింది గణాంకాలు దీన్ని తెలియజేస్తాయి.

★ 1971-81 మధ్య బెంగళూరు జనాభా 75.6% పెరిగింది.

**1981 - 91 మధ్యకాలంలో...**

అసన్‌సోల్ (పశ్చిమ్ బంగ) జనాభా పెరుగుదల - 108.7%

| | | |
|---|---|---|
| ఫరీదాబాద్ (హరియాణ) | - | 85.5% పెరుగుదల |
| గువహటి (అసోం) | - | 188.53% పెరుగుదల |
| థానే (మహారాష్ట్ర) | - | 105.9% పెరుగుదల |
| విశాఖపట్నం (ఆంధ్రప్రదేశ్) | - | 75.0% పెరుగుదల |
| భువనేశ్వర్ (ఒడిశా) | - | 87.7% పెరుగుదల |

**1991–2001 మధ్యకాలంలో...**

| | | |
|---|---|---|
| సూరత్ (గుజరాత్) | - | 85.1% పెరుగుదల |
| నాసిక్ (మహారాష్ట్ర) | - | 58.9% |

**మెగా సిటీల జనాభా అభివృద్ధి (1991 – 2001)**

2011లో 53 మెగాసిటీలు ఉన్నాయి.

| | | |
|---|---|---|
| దిల్లీ | - | 52.24% |
| గ్రేటర్ ముంబయి | - | 30.47% |
| కోల్‌కతా | - | 19.60% |

పట్టణ సముదాయాలు అనే భావనను 1971లో ప్రవేశపెట్టారు.

**2001 - 2011 మధ్య జనాభా వృద్ధి రేటు**

| | | |
|---|---|---|
| దిల్లీ | - | 26.29% |
| గ్రేటర్ ముంబయి | - | 12.05% |
| కోల్‌కతా | - | 6.87% |

★ లక్ష అంతకంటే ఎక్కువ జనాభా ఉన్న క్లాస్-1 సిటీలు మొత్తం పట్టణ జనాభాలో 1951లో 44.6%, 2011లో 70.00% జనాభా కలిగి ఉన్నాయి.

★ దిల్లీ, కోల్‌కతా, ముంబయిలో మొత్తం జనాభా 2001 లో 42.5 మిలియన్లు; 2011లో 48.8 మిలియన్లు. ఈ 3 మెగా సిటీల్లో మొత్తం పట్టణ జనాభాలో 13 శాతం నివసిస్తున్నారు.

## గ్రామీణ - పట్టణ జనాభా

గ్రామీణ - పట్టణ జనాభా అనేది అభివృద్ధిని సూచిస్తుంది. గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు జరిగిన విధానం కూడా దీనిలో భాగంగా చెప్పవచ్చు.

★ పై అంశాల ఆధారంగా పట్టణ జనాభా 1971లో 109 మి॥ నుంచి 377 మి॥కు పెరిగింది.

★ పట్టణ జనాభా శాతం 1971 నుంచి 2011 మధ్యకాలంలో 19 శాతం నుంచి 31.2 శాతానికి పెరిగింది.

★ గ్రామీణ జనాభా 2011 నాటికి 833 మిలియన్లు ఉంది. ఇది 68.8% శాతం. పట్టణ జనాభా 31.2 శాతం ఉంది. దేశంలో పట్టణ జనాభా క్రమంగా పెరుగుతోందని చెప్పవచ్చు.

★ 2001-11 మధ్య పట్టణాలు, చట్టబద్ధ పట్టణాలు, సెన్సస్ పట్టణాల సంఖ్య క్రమంగా పెరిగింది.

## పట్టణ ప్రదేశాలు - నిర్వచనం

★ 1971 జనాభా లెక్కల ప్రకారం కింది ప్రదేశాలను పట్టణ ప్రదేశాలుగా వర్గీకరిస్తారు.

1. పురపాలక సంఘం, నగరపాలక సంఘం, కంటోన్మెంట్ బోర్డు, లేదా ప్రకటిత పట్టణ ప్రాంతం ఉన్న ప్రదేశాలు.
2. కింది లక్షణాలు ఉన్న ప్రదేశాలను కూడా పట్టణ ప్రదేశాలుగా వర్గీకరిస్తారు.

ఎ) కనీస జనాభా - 5000

బి) కనీస జన సాంద్రత - 400

సి) మగ శ్రామికులు వ్యవసాయేతర పనుల్లో కనీసం 75% మంది పాల్గొనటం.

★ పట్టణాలను 2 రకాలుగా వర్గీకరిస్తారు.

1) చట్టబద్ధ పట్టణాలు (Statutory towns) - దీని పరిధిలోకి 1971 జనాభా వర్గీకరణలో తెలిపిన పురపాలక, నగర పాలక సంఘాలు, కంటోన్మెంట్ బోర్డులు మొదలైనవి వస్తాయి.

2) సెన్సస్ పట్టణాలు (Census towns) - 1971 వర్గీకరణలో 2 వ భాగంలో ఉన్న లక్షణాలు గల ప్రాంతాలు...

**దేశంలో అత్యధిక పట్టణ జనాభా గల రాష్ట్రాలు**

1) మహారాష్ట్ర – 50.8 మి॥ (13.5%)

2) ఉత్తర్‌ప్రదేశ్ – 44.4 మి॥ (11.8%)

3) తమిళనాడు – 34.9 మి॥ (9.3%)

**అత్యల్ప పట్టణ జనాభా గల రాష్ట్రాలు**

1) సిక్కిం - 0.15 మి॥ (0.1% కంటే తక్కువ)

2) అరుణాచల్ ప్రదేశ్ - 0.31 మి॥ (0.1%)

3) మిజోరాం - 0.56 మి॥ (0.17%)

★ **మెగా నగరాలు:** దిల్లీ, గ్రేటర్ ముంబయి, అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్ మెగా నగరాలు. వీటిలో 4 మి॥ కంటే ఎక్కువ జనాభా ఉంది.

| జనాభా అంశం | 1971 | 2011 |
|---|---|---|
| మొత్తం జనాభా (మి॥) | 548 మి॥ | 1210 మి॥ |
| గ్రామీణ జనాభా (మి॥) | 439 మి॥ | 833 మి॥ |
| పట్టణ జనాభా (మి॥) | 109 మి॥ | 377 మి॥ |
| పట్టణ జనాభా (%) | 19% | 31.2% |
| గ్రామీణ జనాభా దశాబ్ద వృద్ధిరేటు | 21.8% | 12.2% |
| పట్టణ జనాభా దశాబ్ద వృద్ధిరేటు | 38.3% | 31.8% |

- దాసరి రాజేందర్

www.eenadupratibha.net
www.eenadupratibha.net